# అత్యంత సన్నిహితులు

## నిడదవోలు మాలతి

ooo

వారం రోజులుగా రాళ్లుపేల్చిన ఎండ తగ్గుముఖం పట్టినట్టుంది. రాత్రి కుండపోతగా కురిసిన వర్షం తగ్గి, తుంపరలు మాత్రం పడుతున్నాయి సన్నగా.
హాస్పిటల్ బెడ్మీద పడుకుని సుమిత్ర కిటికీలోనుండి చూస్తూ ఆలోచిస్తోంది. మామూలుగా అయితే నాలుగున్నర మైళ్లు నడిచేసును ఇలాటి సమయాల్లో, కాలికి కట్టూ, మెళ్లో పట్టెడా, పక్కఎముకల్లో పోట్లూ లేకపోతే. కదిలినప్పుడల్లా ప్రాణం జివ్వున లాగేస్తోంది. ఒళ్లంతా పచ్చిపుండు. అలాగే నెమ్మదిగా రవంత ఓపిక తెచ్చుకుని పక్కకి తిరిగి కిటికీలోంచి చూస్తోంది.

ooo

సుమిత్ర అమెరికా వచ్చి ఏడాదిన్నర అయింది. పోస్టుడాక్గా వచ్చింది. రాగానే వాళ్ల ప్రొఫెసరు కోరికమీద మరో పోస్ట్డాకు ఆవిడకి ఇళ్లు చూపించడానికి బయల్దేరాడు కారు తీసుకుని. మొదట యూనివర్సిటికి దగ్గరయితే బాగుండుననుకుంది కాని ఇక్కడ ''సూడెంటుబాబుల'' గదులు ఎలా వుంటోయో చూసేసరికి కడుపులో దేవినట్టయింది. అమెరికాలాటి గొప్పదేశంలో ఇళ్లు ఇంత ఛండాలంగా వుండగలవని ఎవరేనా చెప్తే కుళ్లుబుద్ధితో చెప్తున్నారేమో అనుకుని వుండును. కాని తాను కళ్లారా చూసి, కళ్లు తిరిగి, పదండి అని గబగబా అక్కడినించి వచ్చేసింది, ఇల్లు చూపించిన అమెరికన్ అబ్బాయితో.
యూనివర్సిటి దగ్గర బాగుండవని తెలిసినతరవాత కొంచెందూరంలో మరో ఎపార్టుమెంటు చూపించాడతను. అది బాగానే వుంది. పైగా బస్సు గుమ్మంముందు ఆగుతుంది. అంచేత కారుండాలన్న బాధ లేదు. పైగా యూనివర్సిటీదగ్గర పార్కింగు చాలా కష్టం. ఇలా చాలా కారణాలు చూపించి, ఆ ఎపార్టుమెంటులో ప్రవేశపెట్టేశాడు సుమిత్రని.

ఆసాయంత్రమే, కూరా, నారా తెచ్చుకుందాం అని బజారుకి బయల్దేరింది తను. బస్సెక్కబోతూంటే పొరుగాయన కనబడి, ''కాస్త దూరం అయినా వూళ్లో వుడ్మన్స్లో కూరలూ పళ్లూ తాజాగానూ చవగ్గానూ వుంటాయ''ని చెప్పాడు. ఆయనకీ కారు లేదు. తాను బస్సులో వెళ్లి, టాక్సీలో వస్తానని చెప్పాడు. కావలిస్తే మీరు కూడా నాటాక్సీ రావచ్చు అని కూడా చెప్పాడు, ఖర్చులు పంచుకోవచ్చు అని ధ్వనిస్తూ. సుమిత్రకి అది బాగానే వుందనిపించింది. అలా కొన్నాళ్లపాటు సాగింది.
కాని త్వరలోనే అది, సుఖదాయకం, శాంతిదాయకం కాకుండా పోయింది. పొరుగాయన ''ఇదిగో ఈపక్కనే'', ... ''ఒక్కనిముషం,'' ... ''ఒక్క వస్తువే'' .... అంటూ కూరలషాపునించి మరో షాపుకీ, మరో పనికీ తిరగడం, ఇద్దరికీ

అనుకూలమైన సమయాలు కుదరకపోవడం - ఇలా ఏవేవో ఆటంకాలు రావడం మొదలయేయి. అలాటి రోజుల్లోనే సుమిత్రకి కారొకటి కొనుక్కుంటే పోదూ అనిపించింది. ఆవిడెవరో రాసిన విదేశయాత్ర పుస్తకంలో అమెరికాలో కారులు కారుచౌక అని చదివింది. అయిదు వందలు పారేస్తే బంగారంలాటి కారొస్తుంది, అమెరికాలో కారులేనివారిని కానం ... అంటూ రాసిందావిడ.

అఫ్‌కోర్సు, కారులేనివారు అమెరికాలో వుందురు అని సుమిత్రకి తొందరగానే తెలిసిపోయింది. అదుగో, అలాటప్పుడే, శ్యామల కనిపించింది. ఓసాయంత్రం షికారుకెళ్లినప్పుడు, వాళ్ల పిల్లల్నిద్దరినీ, పొరుగింటిపిల్లాడినీ పార్కులో ఆడించడానికి తీసుకెళ్తూ.

"అలా దౌడు తీయకురా."

తేటతెనుగు పలుకు విని, వులిక్కిపడి అటు చూసింది సుమిత్ర.

సుమిత్ర తనవేపు చూడడం శ్యామల చూసింది. ఆవిడ కూడా చిరునవ్వు నవ్వింది.

సుమిత్ర ఉక్కిరిబిక్కిరి అయిపోతూ "మీరు తెలుగువాళ్లా?" అంది.

అమెరికాకివచ్చిన కొత్తలో అలాగే వుంటుంది చాలామందికి. తెలుగు వినిపిస్తే ఉలికిపడతారు. ప్రాణం లేచొస్తుంది. అలా అయిన వారిపరిచయం అనతికాలంలోనే నువ్వంటే నువ్వనుకునేవారకూ వచ్చేసింది.

అట్టి సమయంలోనే సుమిత్ర ఒకారు కొనుక్కుంటే పోదూ అనుకుంటోంది.

శ్యామల స్వయంగా కారు నడపదు. వాళ్లకి కూడా కారు లేదు. ఎప్పుడేనా కొనుక్కోక తప్పదుకదా అని కారులమీద చాలా రిసెర్చి చేసి పెట్టుకుందావిడ, భర్త సురేష్ పనికెళ్లేక, పెద్దపిల్లాడిని స్కూల్లో వదిలేసొచ్చాక, చిన్నదాన్ని నిద్ర పుచ్చేక, కంప్యూటరుమీదా, న్యూస్పేపర్లలోనూ.

శ్యామల సుమిత్రకి చెప్పిందేమిటంటే, అయిదువందలకి వచ్చే కారులు మనం నడిపేలా వుండవు. మనం నడపలేం వాటిని. మనకి నమ్మినబంటు హనుమంతునివంటి కారు కావాలి. కంటికి నదరుగా కాకపోయినా చూడగానే అదిరిపడేలా వుండరాదు. మైలేజి తక్కువుండాలి. మైళ్లు ఎక్కువివ్వాలి. ...

ఆతరవాత ఓ వారాంతం, శ్యామలే మళ్లీ పిలిచింది. "పద, ఊరికెనే చూద్దువు గానీ, చూడగానే కొనెయ్యాలని ఏంలేదు కదా" అంది. "సరే" అంది సుమిత్ర, కాలక్షేపంగానూ వుంటుందీ, ఎడ్యుకేషను గానూ వుంటుందని.

అలా సుమిత్ర కారు కొనడం అయిపోయింది. కారు కొన్నతరవాత, శామలే శ్యామలని పిలుస్తూ వచ్చింది బజారుకో సినిమాకో పార్టీలకో వెళ్లినప్పుడల్లా.

రోజులెప్పుడూ ఒక్కలాగే వుండవు అన్న సూక్తిని నిరూపించడానికేమోనన్నట్టు శ్యామలా వాళ్లూ ఇల్లు మారేరు. అదీ వూరికి వుత్తరంగా ఆరుమైళ్ల దూరం వెళ్లిపోయారు. మంచి ఎపార్ట్‌మెంటు ఎక్కువ వసతులతో, తక్కువఅద్దెకి దొరికిందని.

సుమిత్రకి కారుంది కనక తనే తరుచూ శ్యామలావాళ్లింటికి వెళ్లడం ఆనవాయితీ అయిపోయింది. ఆవిషయంలో సుమిత్రకేమీ బాధ లేదు.

రెండోసారి వెళ్లినప్పుడు శ్యామల అంది, "అన్నీ బాగానే వున్నాయి కానీ బజారు చేసుకోడమే ఇబ్బంది అవుతోంది. మరీ దూరం అయిపోయింది."

సుమిత్రకి నిజమే అనిపించింది. "ఎలాగా వచ్చాను కదా, పద. కనీసం ఈవారం కావలసినవి తీసుకొచ్చుకుందువు గానీ" అంది.

శ్యామల ఒప్పుకోలేదు. "బజారు దాదాపు మీయింటిదగ్గర. అక్కణ్ణించి ఇక్కడికొచ్చి, మళ్లీ అంతదూరం వెళ్లి, మళ్లీ ఇక్కడుకొచ్చి నన్ను దింపి మళ్లీ మీయింటికెళ్లడం అంటే నీకారు మాటెలా వున్నా రోడ్డు అరిగిపోతుంది," అంది నవ్వుతూ.

కాని సుమిత్ర ఒప్పుకోలేదు. "ఫరవాలేదులే, పాలవాడుకలా వారం వారం హాజరవుతాననడం లేదు. వచ్చినప్పుడు చేస్తాను. నేన్రానప్పుడు, టాక్సీ ఎలాగా తప్పదు", అంది.

ఆవిధంగా రాతకోతలు లేని ఓ ఒప్పందం కుదిరిపోయింది వారిద్దరిమధ్యా.

కాని శ్యామలకి మొహమాటంగానే వుంటోంది. అవునూ, కాదూ, ఫరవాలేదూ అంటూ జరుపుకొస్తున్నారు. బజారుకో పేరంటానికో సుమిత్ర తనని తీసికెళ్లినప్పుడల్లా "గాస్ మనీ" అయినా తీసుకోమని అడుగుతూనే వుంది. ఈదేశంలో అది మామూలే, అందులో తప్పు లేదు అని కూడా చెప్తూ వస్తోంది. ఆఖరికి శ్యామలని సంతోషపెట్టడానికి సుమిత్ర ఒకటి రెండుసార్లు డబ్బు పుచ్చుకుంది.

రెండోసారి రోజులెప్పుడూ.ఒక్కలాగే వుండవు అనుకోడానికి ఆస్కారంగల మరోచిన్న వ్యథ సంభవించింది.

ఊరి పొలిమేరల్లో కొత్తగా ఇల్లు కట్టుకున్న రాధాస్వామినాయుడుగారిభార్య సీతాలక్ష్మిగారు ఊళ్లో వున్న తెలుగువారినందరినీ పిలిచారు గృహప్రవేశానికీ, సత్యనారాయణ వ్రతానికీను. సుమిత్రని పిలిచి, ఆమాటా ఈమాటా మాటాడి, "మీరు శ్యామలగారిని తీసుకురాగలరా?" అని అడిగారు.

"అలాగేనండీ, దానిదేముంది," అంది సుమిత్ర.

ఆరోజుకి వూరుకుని, మర్నాడు శ్యామలని పిలిచి, సీతాలక్ష్మిగారింటికి వస్తున్నావా అనడిగి, అయిదుగంటలకి రానా అనడిగింది. సాయంత్రం ట్రాఫిక్ ఎక్కువగా వుంటుంది, ఈచివరినించి ఆచివరికి వెళ్లాలి కదా అని.

అలాగే అంది శ్యామల. అనుకున్నట్టుగానే సుమిత్ర వచ్చింది. శ్యామలా పిల్లలూ కారెక్కారు.

సీతాలక్ష్మిగారింట్లో హలో, హలోలు అవుతూండగా, ఒకావిడ "కాంతిమతిగారు వచ్చినట్టు లేదే" అన్నారు.

"లేదు. ఆవిడ డ్రైవు చెయ్యరు కదా. వాళ్లాయన ఊర్లొ లేరంట."

"మీరెలా వచ్చారు? మీరు కూడా డ్రైవ్ చెయ్యరనుకుంటానే," అనడిగింది శ్యామలని ఆవిడే.

"సుమిత్రతో వచ్చాను,"అంది శ్యామల.

"మంచామెనే మీకు దోస్తు దొరికింది. నేనయితే అసలు పోడమే మానుకుంటా," అని, అక్కడితో వదిలిపెట్టకుండా సుమిత్రవేపు తిరిగి మెచ్చుకోలుగా, "మీకు నిండా ధైర్యం. హైరోడ్‌మీన కూడా డ్రైవు చేస్తురు. నేనయితే మా యిల్లూ, పిల్లగాండ్ల స్కూలూ, షాపింగూ ... అంతే ఆపైన ఏడకి పోవాలనినా, రెడ్డిగారే," అంది.

మళ్లీ శ్యామలతో, "మీరు మాయింటికి రానేలేదు. ఫైవారం రండి. సుమిత్రగారూ, మీరునూ రండిమీ. ఆమెను తోడుకొని," అంది.

శ్యామలకి ఏంచెప్పాలో తోచలేదు. తెల్లబోయి చూస్తూ వూరుకుంది. సుమిత్ర అలాగేలెండి అనేసి, లేచి, కిటికీదగ్గరికెళ్లి చూస్తూ, "మీ మందారచెట్టు బాగా పూస్తోందండీ," అంది సీతాలక్ష్మిగారితో.

"ఇవాళ ఎండ బావుందికదా అని ఇందాకే బయట పెట్టాను. కాస్త చల్లబడితే, ఇంట్లోకి తీసుకొచ్చేయాలి. నాకు మొక్కలంటే ప్రాణం. అసలందుకే పెద్ద పెరడున్న ఇంట్లోకొచ్చాం" అందావిడ..

"అవునండీ ఇక్కడ మొక్కలూ, కుక్కలే గదా జనాలకి తోడు," అన్నారు మరెవరో.

చర్చ మలుపు తిరిగినందుకు సుమిత్రా, శ్యామలా కూడా హమ్మయ్య అనుకున్నారు స్వగతంగా.

ఆరోజు కార్లో ఎందుకో శ్యామల అట్టే మాటాడలేదు. సుమిత్రకి మాటాడాలని వుంది కాని ఏంమాటాడడానికీ తోచడం లేదు.

శ్యామలని వాళ్లింటిదగ్గర డ్రాప్ చేసి, "రేపు పిలుస్తాలే" అని చెప్పి సుమిత్ర ఇంటికి వెళ్లిపోయింది.

కాని వాళ్లిద్దరి మనసుల్లోనూ వాళ్లూ వీళ్లూ చేసిన అనవసర ప్రసంగం తాలూకు ఛాయలు సన్నగా పరుచుకుంటున్నాయి అసురసంధ్య చీకటిలా. శ్యామలేం అనుకుంటోందో మనసులో అని సుమిత్ర, సుమిత్ర ఏం అనుకుందో అని శ్యామల మథనపడుతున్నారు. మాటాడడం పూర్తిగా మానేయకపోయినా, వారిమధ్య ఇదమిత్థం అని నిర్వచించలేని తెరల్లేచేయి.

ooo

సుమిత్ర ఎమర్జెన్సీగదిలో మంచంమీద పడుకుని వుంది. తను ఇక్కడ ఎందుకుందో, చుట్టూ వున్నవారెవరో వాళ్లేం అడుగుతున్నారో స్పష్టంగా తెలీడంలేదు.

ఏవో పరీక్షలు, ఏవేవో ప్రశ్నలు, ...

ఇంతలో గుమ్మంలో అలికిడి అయి అటువేపు తిరగబోయింది. మెడకున్న పట్టెడమూలాన నొప్పి. ...

"కదలకు" ఎవరో హెచ్చరించారు.

శ్యామల నెమ్మదిగా అడుగులో అడుగేసుకుంటూ వచ్చి పక్కన నిలబడి "ఎలా వుంది?" అంది.
సుమిత్ర, "బాగానే వున్నాను," అంది నీరసంగా.
కొంచెంసేపు ఇద్దరూ మాటాడలేదు. శ్యామల దగ్గరున్న నర్సుని అడిగింది వివరాలు.
ఆ అమ్మాయి డాక్టరుతో మాటాడమంది. శ్యామల సుమిత్రచేతిమీద సుతారంగా చెయ్యేసి, నెమ్మదిగా తట్టి, "రెస్టు తీసుకో, డాక్టరుతో మాటాడి వస్తాను," అని వెళ్లింది.
సుమిత్ర సరేనన్నట్టు కనురెప్పలు ఆడించింది.
పావుగంట తరవాత శ్యామల తిరిగి వచ్చింది. "డాక్టరు ఫరవాలేదన్నారు. ఈరాత్రికి ఇక్కడ వుంచమన్నారు. రేపు ఇంటికి వెళ్లిపోవచ్చునేమో అంటున్నారు," అంది.

మర్నాడు శ్యామల వచ్చింది పన్నెండు గంటలకి. "డాక్టరు ఇంటికెళ్లొచ్చు అన్నారు, నాలుగు రోజులపాటు బెడ్‌రెస్టు కావాలన్నారు." అని శ్యామల క్లాజట్ దగ్గరికెళ్లి బట్టలు తెచ్చి అందిచ్చింది సుమిత్రకి.
రిలీజ్ కాగితాలమీద సంతకాలూ, గట్రా అయేక, సుమిత్ర ప్రతి పేషంటులాగే అక్కర్లేదు అని, "హాస్పిటల్ రూల్స్" అని వాళ్లచేత చెప్పించుకుని వీల్‌చైర్‌లో కూర్చుంది.

బయటికి వచ్చేక, "నువ్వు ఇక్కడుండు, కారు తీసుకొస్తాను" అని చెప్పి వెళ్లి పదినిముషాల్లో వచ్చింది కారు తోలుకుంటూ. సంచీ ట్రంకులో పడేసి, కారు తలుపుతీసి, సుమిత్ర కారు ఎక్కడానికి చెయ్యందించింది.
సుమిత్ర కారెక్కింతరవాత అడిగింది, నిన్నటినించీ తనని వేధిస్తున్న, తాను అడగాలనుకుంటున్న ప్రశ్న అడిగేసింది మరి ఉండబట్టలేక, "నీకెలా తెలిసింది?"
"వాళ్ల రికార్డుల్లో అత్యంత సన్నిహితులు [నెక్స్ట ఆఫ్ కిన్] అని వున్న బాక్స్‌లో నాపేరు వుందని నన్ను పిలిచారు. ఒక్కదానివి ఎలా వుంటావు, మాయింటికి వెళ్దాం," అంది శ్యామల నిష్కల్మషంగా .

ఇద్దరిమనసులూ తేలిక పడ్డాయి. హాస్పిటల్‌నించి నేరుగా తమయింటికే తీసుకెళ్లింది శ్యామల సుమిత్రని.
సుమిత్ర కారు దిగుతూంటే, ఆంటీ అంటూ పిల్లలు ఒక వుదుటున మీద పడబోయారు. సురేష్ వాళ్లని పట్టుకుని, ఆపి, "రండి, జాగ్రత్త," అంటూ ఆప్యాయంగా ఆహ్వానించాడు.

ooo.

(ఆగస్ట్ 2007)